క్లుప్తంగా

ముగిసిన అభయాంజనేయ పరస మహోత్సవం



వేదికపై వైఎస్సార్ సీపీ నాయకుడు చొక్కాకుల వెంకటరావు, కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం : మహా శివరాత్రి సందర్భంగా తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నుంచి ఈ ప్రాంతంలో అంగరంగ వైభవంగా పరస, జాతర నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో జాతరను సందర్శించారు. స్థానిక నాయకుల సహకారంతో రేలా రే రేలా, ఆట – పాట కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ఆళ్ల మధుసూదన నరసింగరావు, కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకుడు చొక్కాకుల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

చందనం సమర్పణకు రూ.50 వేల విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందిస్తున్న దాత రఘురామరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం రూ.50 వేల విరాళాన్ని నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఎ.రఘురామరాజు బుధవారం అందించారు. ఆలయంలో సూపరింటెండెంట్ త్రిమూర్తులకు విరాళాన్ని చెక్ రూపంలో ఇచ్చారు. కార్యక్రమంలో హవల్దార్ సాతులూరి రవి, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో పోలింగ్ కేంద్రం



పాలిటెక్నిక్ కాలేజీలో పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మురళీనగర్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్తర నియోజకవర్గంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పోలింగ్ కేందం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 921 మంది ఓటర్లు ఉండగా వీరిలో 421 మంది ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యుల ఓట్లున్నాయి. వీరు ఓటు వినియోగించుకునేందుకు వీలుగా పాలిటెక్నిక్ కాలేజీలో కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రాంగణంలోని స్కిల్ హబ్‌ను అనుకుని శిక్షణ కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలులో ఉంటుంది. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగు జరుగుతుంది. పోలింగ్ జరిగే ప్రాంతాన్ని పోలీసు అధికారులు బుధవారం పరిశీలించారు.

చురుగ్గా గ్రీన్‌బెల్టుకు ఫెన్సింగ్ పనులు



గాంధీనగర్ కాలనీ వద్ద గల గ్రీన్‌బెల్టు స్థలంలో ఏర్పాటు చేస్తున్న గ్రిల్స్

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్ వద్ద గ్రీన్‌బెల్టుకు ఫెన్సింగ్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేశారు. ఈ ఏడాది జనవరి 23న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేయగా... జోన్ – 3 అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి పనులు పర్యవేక్షిస్తున్నారు. జాతీయ రహదారి మీద సత్యం జంక్షన్ నుంచి గురుద్వారా వైపు ఫెన్సింగ్ ఏర్పాటు కోసం సుమారు రూ.60 లక్షల వ్యయంతో పనులు చేస్తున్నారు. గ్రీన్‌బెల్టు ప్రాంతాల్లో కబ్జాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ చర్యలు చేపట్టారు. గ్రీన్‌బెల్టు స్థలాల పరిరక్షణకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గణేష్‌నగర్ శివాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



శివరాత్రి వేడుకల్లో మేయర్ హరివెంకటకుమారి



శ్రీలలితాపీఠంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



స్పటిక లింగానికి అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

హరహర మహాదేవ శంభో శంకర

- ఆలయాల్లో ప్రతిధ్వనించిన శివనామస్మరణ
- దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రామలింగేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు



బాపూజీనగర్ కోదండ విశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు ప్రకాశ్ శర్మ

సీతంపేట : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి శివుని దర్శనం కోసం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. జలాభిషేకాలు, క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు, రుద్రాభిషేకాలు, హోమాలు, భక్తుల శివన్నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. సీతంపేట గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5 గంటల నుంచి అభిషేకాల కోసం భక్తులు క్యూ కట్టారు. అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ పార్వతీశ్వరునికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. బుధవారం రాత్రి 9 గంటల నుంచి రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. లింగోద్భవ కాలంలో శివలింగానికి బియ్యంతో అభిషేకించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- స్థానిక శంకరమఠం రోడ్‌లోని రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలతో ఆధ్యాత్మికత చోటుచేసుకుంది. రాత్రి మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవకాలంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసానంతరం భక్తులు తిరిగి సాయంత్రం ఆలయాలను సందర్శించి ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈవో రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- శ్రీలలితాపీఠంలో లలితా అమ్మవారికి తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకం, మణిద్వీపంలో కామేశ్వరుడికి ఏకవార అభిషేకాలు నిర్వహించారు. పండితుల వేద మంత్రాల మధ్య అఘోర పాశుపత హోమం జరిపించారు. రాత్రి కాశీ కాలభైరవులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కంచరపాలెం : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం కంచరపాలెం పరిధిలో గౌరీ శంకరాలయం, యల్లబిల్లివారి గౌరీ శంకర పంచాయతన ఆలయం, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, ఇందిరానగర్‌లో లక్ష్మీ గణపతి ఈశ్వరరాలయం, ధర్మానగర్ బీవన్‌టీవన్ కాలనీలో హేరంబ కోదండ ఉమ మహేశ్వరాలయం, 104 ఏరియా బాపూజీనగర్ కోదండరామ లింగేశ్వరాలయం తదితర ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, అర్చనలు, రజిత బిల్వార్చన, పూర్ణాహుతి, శత రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. ఉపవాసం, జాగరణ కోసం అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆయా ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మురళీనగర్ : హరహర మహదేవ శంభో శివశంకర అంటూ భక్తుల శివ నామస్మరణతో మురళీనగర్ పరిసరాల్లోని శివాలయాలు మార్మోగాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా మురళీనగర్ రామాలయంలోని ఉమారామలింగేశ్వరస్వామి, సత్యానగర్ సోమలింగేశ్వరాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మురళీనగర్ రామాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మంచిలి భానుమూర్తి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సత్యానగర్‌లోని సోమలింగేశ్వరాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. సత్యానగర్, సూర్యానగర్, పట్టాభిరెడ్డితోట, అయ్యప్పనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ పరిసర ప్రాంత భక్తులు పాల్గొని శివుడిని దర్శించుకున్నారు.



సీతంపేట పార్వతీశ్వరాలయంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శివయ్య

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి రామచంద్రనగర్‌లో గల ఉమారామలింగేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తైనాల విజయకుమార్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకాలు, పూజలు చేయించారు. అనంతరం పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆలయ కమిటీ సభ్యులు తైనాల విజయకుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు.

ఆధ్యాత్మిక చింతనతో శివరాత్రి

బ్రహ్మకుమారీలు ఎంతో ఆధ్యాత్మిక చింతనతో మహా శివరాత్రి వేడుకలు జరుపుకుంటారని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. రైల్వే న్యూ కాలనీలో గల బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంస్థలో బుధవారం మహా శివరాత్రి వేడుకలు నిర్వహించారు. బ్రాంచి ఇన్‌చార్జి శశికళ, విశాఖ కంటైనర్ టెర్మినస్ జీఎం హెచ్‌ఆర్ జితాజీ, తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ – 2లోని హరిహర క్షేత్రంలో కొలువైన స్పటిక లింగేశ్వర స్వామికి బుధవారం అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమా నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు రామారావుశర్మ, మహేష్ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ సిబ్బంది వెంకట విజయ గోపాలరాజు, భక్తులు పాల్గొన్నారు.

- సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిరిడీసాయి బాబా దేవస్థానంలో తెల్లవారుజాము నుంచే అర్చకుడు రాజాస్వామి పర్యవేక్షణలో పూజలు, అభిషేకాలు చేశారు.
- జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లో గల త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో అర్చకుడు ఏడిద గురునాథ శర్మ, కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్ఎన్.మూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



లలితా పీఠంలో అఘోర పాశుపత హోమం జరిపిస్తున్న వేద పండితులు



శివలింగానికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు



నక్కవానిపాలెం శివాలయంలో పూజలో భక్తులు



మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ దంపతులతో ఆలయ కమిటీ సభ్యులు

శంకరమఠం రోడ్‌లో బహిరంగ మద్యపానం



శంకరమఠం రోడ్‌లో జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పక్కన తాగిపడేసిన మందు బాటిళ్లు

సీతంపేట : నగరంలోని ప్రధాన రహదారిలో బహిరంగ మద్యపానం జరుగుతున్నా నియంత్రించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. రాష్ట్రంలో బహిరంగ మద్యపాన నిషేధం అమలులో ఉన్నా కొన్ని ప్రాంతాలకు మాత్రం వర్తించడం లేదనే చెప్పాలి. అక్కయ్యపాలెం శంకరమఠం రోడ్‌లో జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పక్క రోడ్ తాగుబోతులకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు ఇక్కడ బాటిళ్లు గళగళలాడుతున్నాయి. ఆ రోడ్‌లో జన సంచారం తక్కువగా ఉండటం, వీధి లైట్లు సరిగా వెలగక చీకటిగా ఉండటంతో ఆకతాయులు మందు తాగడానికి అడ్డాగా మార్చుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వారు తాగి పడేసిన సీసాలు కుప్పలుగా పడి ఉన్నాయి అంటే ఏ స్థాయిలో అక్కడ మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆ రోడ్‌లో ఉన్న టీ షాపు వద్దకు, బ్యాంకు వద్దకు నిత్యం ఎంతో మంది వస్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పదుల సంఖ్యలో పడి ఉన్న మందుబాటిళ్లు చూసి ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోతున్నారు. ప్రధాన రహదారిలో ఇంత విచ్చలవిడిగా బహిరంగ మద్యపానం జరుగుతున్నా నైట్ పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు ఏం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులపై మద్యపానం నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

శివతాండవం కావ్యంపై ప్రసంగం



ప్రసంగిస్తున్న రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట : మహా శివరాత్రి సందర్భంగా సహృదయ సాహితి ఆధ్వర్యంలో సరస్వతి పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన శివతాండవం కావ్యంపై తిరుమల బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ ప్రసంగ కార్యక్రమం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. నాట్య సాంప్రదాయంలోని పలు విశేషాలను ఆయన వివరిస్తూ శివతాండవ, శివలాస్య నాట్యాలను ప్రతిభావంతంగా ఎలా వర్ణించారో... ఎన్నో చరణాలను గానం చేస్తూ కవి ప్రయోగించిన పలు శబ్దాల భావార్థాలను సభకు వివరించారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ నారాయణాచార్యుల కవితా ప్రతిభను వివరించారు. కె.జి.వేణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దర్భముళ్ల చంద్రశేఖర్, భాగవతుల సత్యనారాయణ, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

గురుద్వారా బస్ బేలో అధ్వానంగా మరుగుదొడ్లు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధిలోని గురుద్వారా బస్ బే ప్రాంతంలో గల మరుగుదొడ్లు అధ్వానంగా తయారైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏడాది కిందట వైఎస్సార్ సీపీ పాలనలో ఆధునిక బస్ బేలను రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అనంతరం ప్రభుత్వం మారడంతో జీవీఎంసీ జోన్ – 3 ఇంజినీర్ల పర్యవేక్షణ అంతంతమాత్రమే కావడంతో దారుణంగా తయారయ్యాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుద్వారా నుంచి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ హైవే సిగ్నల్స్ వైపు వెళ్లే బస్ బేలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు సిటీ బస్సులు, దూర ప్రాంతాలకు వెళ్లే లైన్ బస్సుల కోసం ఎక్కువ సేపు వేచి ఉంటారు. ఈ మార్గంలో 540, 541, 111పీ, 38, 28 జెడ్/హెచ్ వంటి సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. అలాగే అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం వంటి దూర ప్రాంతాలకు వెళ్లే లైన్ బస్సులు కూడా వస్తాయి. ఇక్కడ వేచి ఉండే ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన పురుషుల మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. మరోవైపు లేడీస్ టాయ్‌లెట్‌లోని వాష్‌బేషన్, తదితర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు కొద్ది రోజుల క్రితం ధ్వంసం చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి టాయ్‌లెట్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గురుద్వారా బస్ బే వద్ద మరుగుదొడ్డిలో ధ్వంసమైన వాష్‌బేషిన్

అలరించిన ఘంటసాల గానావధానం



ఘంటసాల పాటలపై అవధానం చేస్తున్న సయ్యద్ రహమతుల్లా, తదితరులు

సీతంపేట : మహా శివరాత్రి సందర్భంగా ఘంటసాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల స్వరాలయ స్టూడియోలో బుధవారం ఘంటసాల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన ఆపాత మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నందగోపాల్ ఘంటసాల వేషంలో హావభావాలలతో, గానంతో అలరించారు. సోమయాజుల సత్యవేణి ఘంటసాల సావిత్రి వేషంతో మెప్పించారు. ఘంటసాల పాటలతో నందగోపాల్ ప్రదర్శించిన బుర్రకథ ఆకట్టుకుంది. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా చేసిన గానావధానం సభికులను ఆశ్చర్యపర్చింది. కార్యక్రమంలో గాయనీగాయకులు రామ్మూర్తి, కల్యాణి, అంబిక, రాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సీతమ్మధార : విద్యుత్ హెచ్‌టీ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 09 : 30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్ – 1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కర్లాస్ స్క్వేర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ రోడ్డు, ఎస్‌ఆర్‌ఐ హాస్పిటల్ వెనుక రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతుబజార్‌లో వేరే జిల్లాల టమాటా విక్రయాలు

సీతమ్మధార : టమాటాకి గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రభుత్వం రైతుబజార్లలో విక్రయించుకునే అవకాశం కల్పించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పలురకాల పంటల దిగుబడులు ఎక్కువగా రావడంతో వాటి ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం టమాటా దిగుబడి బాగా పెరిగింది. ఊహించిన దానికన్నా ఎక్కువగా మార్కెట్లోకి రావడంతో ధరలు బాగా పడిపోయాయి. అయోమయ స్థితిలో ఉన్న టమాటో రైతులకు భరోసా కల్పించడానికి రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ చేయూతనిస్తోంది. ఆయా జిల్లాల్లోని టమాటో రైతుల వద్ద మార్కెటింగ్ శాఖ సిబ్బందే స్వయంగా కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సీతమ్మధార రైతుబజార్‌లో అనంతపురం జిల్లా, విజయనగరం జిల్లా సాలూరు ప్రాంతాల నుంచి దేశవాళీ టమాటా దిగుమతి చేసుకుని వినియోగదారులకు విక్రయిస్తున్నారు.

కిలోకి రైతులకు రూ.2 కమిషన్

ఈ సీజన్‌లో టమాటా, కాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం రాత్రి మంచు, ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పండిన పంట త్వరగా పాడైపోతోంది. మరోవైపు టమాటాకు గిట్టుబాటు ధర లభించక రైతులు దిగులుగా ఉన్నారు. చాలా ప్రాంతాల్లో పెట్టుబడి ఖర్చులు కూడా రాక చేతికి వచ్చిన పంటను ఏం చేయలో తెలియని అయోమయ దుస్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుల వద్దకే వెళ్లి టామాటా కొనుగోలు చేస్తోంది. టమాటో నాణ్యతను బట్టి రూ.10 నుంచి రూ.12 వరకు ధర చెల్లిస్తున్నారు. వాటిని రైతుబజార్లకు తీసుకొచ్చి ఇక్కడి రైతుల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. ఇలా విక్రయించేందుకు రైతులకు కిలోకి రూ.2 వంతున కమిషన్ చెల్లిస్తున్నారు. సాధారణంగా రైతులు తాము పండించిన పంటలు రైతు బజార్లలో విక్రయించాలంటే మార్కెటింగ్ శాఖ జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరి. కానీ పంటల దిగుబడులు ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం కార్డు నిబంధనల నుంచి టమాటా రైతులకు మినహాయింపు ఇచ్చింది. రైతులే నేరుగా రైతుబజార్లలో విక్రయించుకునే అవకాశం కల్పించింది. నగరంలోని రైతుబజార్ల సమీపంలో రైతులు లేనందున ప్రభుత్వం దూర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన టమాటో దిగుమతి చేసుకుని స్థానిక రైతుబజార్లలో విక్రయిస్తోంది. ప్రస్తుతం కిలో రూ.14 వంతున విక్రయిస్తున్నారు.



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా స్టాల్